# ప్రాంతంపై అభిమానం..

# అంతర్జాలంలో పదిలం

- నిర్మల్ ప్రాంత విశేషాలతో వెబ్‌సైట్ ఏర్పాటు
- వెబ్ డిజైనర్ ఇందూరి ప్రవీణ్ కుమార్ ఘనత

**నిర్మల్, న్యూస్‌టుడే:** తాను పుట్టిపెరిగిన ప్రాంత విశేషాలు, గొప్పతనాన్ని ప్రపంచ ప్రజలందరికీ చేరవేయాలనుకొన్నారు. ఇందుకు అనువైన మార్గం కోసం అన్వేషించాడు. అంతర్జాలం (ఇంటర్‌నెట్) సరైన మార్గంగా భావించాడు. తాను స్వతహాగా వెబ్ డిజైనర్ కావటంతో తన ఆలోచనను వెంటనే కార్యరూపంలో అమలు చేశాడు నిర్మల్ పట్టణం కాల్వగడ్డ ప్రాంతానికి చెందిన ఇందూరి ప్రవీణ్. బీఎఫ్ఏ పూర్తిచేసిన ఈయన ప్రస్తుతం హైదరాబాద్‌లో వెబ్ డిజైనర్‌గా పనిచేస్తున్నారు.

నిర్మల్‌సిటీ. కామ్ (NIRMAL CITY.COM) పేరుతో 2004 మార్చిలో ప్రత్యేకంగా ఒక వెబ్‌సైట్‌ను సృష్టించాడు. ఇందులో నిర్మల్ పట్టణంతో పాటు జిల్లాలోని ముఖ్య ప్రాంతాలను, వింతలు, విశేషాలు అన్నింటినీ చేర్చాడు.




ప్రవీణ్ రూపొందించిన వెబ్‌సైట్‌లోని హోంపేజీ (ఇన్‌సెట్లో ప్రవీణ్)

## ఒక్క క్లిక్‌తో.. జిల్లా సమాచారం

కొయ్యబొమ్మలు, పెయింటింగ్స్‌లకు నిలయమైన నిర్మల్ ప్రాంతానికి స్వాగతం అంటూ తన వెబ్‌పేజీని ప్రారంభించిన ప్రవీణ్ ఈ వెబ్‌సైట్‌లో జిల్లాకు సంబంధించిన అంశాలన్నింటినీ వివరించాడు. అడవుల జిల్లాగా పేరున్న ఆదిలాబాద్ విశేషాలను కేవలం ఒక్కక్లిక్ దూరంలో అందరికీ అందుబాటులో ఉంచటం విశేషం. జిల్లాలో చూడదగ్గ విశేషాలు, వాటిని దర్శించేందుకు వెళ్ళాల్సిన మార్గాలు, ఉన్న సౌకర్యాలు, సంప్రదించాల్సిన ఫోన్‌నెంబర్లు తదితర అంశాలపై సమగ్ర సమాచారం వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. వీటన్నింటితో పాటు ఈ వెబ్‌సైట్‌లో హైదరాబాద్‌కు సంబంధించిన అంశాలు సైతం త్వరలోనే ఏర్పాటు చేయనున్నారు. హైదరాబాద్, ఆదిలాబాద్, నిర్మల్ ప్రాంతాలకు ఉన్న బస్‌సౌకర్యం వివరాలను తెలియజేశాడు.

## నూతన అంశాలు చేరుస్తూ..

ప్రవీణ్‌కుమార్ వృత్తిరీత్యా వెబ్‌డిజైనర్ కావటంతో నెటిజన్లను ఆకట్టుకునే అంశాలను ఇట్టే గుర్తించాడు. అందుకే ఇక్కడి ప్రాంత విశేషాలను అందంగా తాను రూపొందించిన వెబ్‌సైట్‌లో చేర్చాడు. ఒక్కక్లిక్‌తో నిర్మల్ పట్టణంతో పాటు ఆదిలాబాద్ జిల్లాలోని పర్యాటక ప్రాంతాలు, చరిత్ర, చూడదగ్గ ప్రదేశాలు, వింతలు, విశేషాలు, ఆచార వ్యవహారాలు, సంస్కృతి, సాంప్రదాయలు, పండగలు, ప్రభుత్వ కార్యాలయాలు తదితర అంశాలన్నింటినీ క్లుప్తంగా వివరిస్తూ వెబ్ పేజీలను డిజైన్ చేశారు. ఇటీవలే వెబ్‌సైట్‌లో నిర్మల్ అట్రాక్షన్స్ పేరిట నూతనంగా 1000 ఫొటోలను జతచేశాడు. ఇందులో నిర్మల్ కొయ్యబొమ్మలు, పెయింటింగ్స్, సొసైటీ వర్క్‌షాప్, కోటలు, ఆలయాలు, పర్యాటక కేంద్రాలు, పండగలు, ప్రభుత్వ కార్యాలయాలను సూచించే ఛాయాచిత్రాలను పొందుపరిచారు.

## త్వరలోనే మరిన్ని అంశాలు..

ఇప్పటికే పలు అంశాలు వెబ్‌సైట్‌లో పొందుపరిచిన ప్రవీణ్ త్వరలోనే మరిన్ని అంశాలను చేర్చేందుకు సిద్ధంగా ఉన్నారు. వీటిలో లింగాపూర్ గుండం జలపాతం, కెరమెరి గుహలు, డైనోసార్ ఫాసిల్స్, అడెల్లి పోచమ్మ ఆలయం, జోడేఘాట్ కొమరంభీం, భైంసాలోని మహిషాసుర ఆలయం, డ్వాక్రా మెటల్ క్రాఫ్ట్, ఇచ్చోడలోని రాతికట్టడాలు తదితర ప్రదేశాలను, వాటి విశేషాలను రూపొందించనున్నాడు.

ప్రపంచంలో ఎక్కడినుంచైనా జిల్లాకు సంబంధించిన సమాచారాన్ని క్షణాల్లో గుర్తించవచ్చు